

ముగిసిన కబడ్డీ పోటీలు

పెద్దవూర మండలం చింతపల్లిలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీలు ముగిశాయి. - 10లో



రామలింగేశ్వరుడికి రుద్రాభిషేకం

యాదాద్రి కొండపైన రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు శనివారం కొనసాగాయి. - 10లో

గరిష్టం/కనిష్టం 35°/19°

వాతావరణం

ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఆహ్లాదకరంగా ఉంటుంది. రాత్రి చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. అనంతరం స్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టి కల్యాణం జరిపారు. నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ఛైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, దేవాలయ ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, వంశీకృష్ణమాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్‌ఎన్‌ఎస్ పాత్ర కీలకం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : సీపీఐ (ఎంఎల్) ఏర్పాటులో సత్యనారాయణ సింగ్ (ఎస్‌ఎన్‌ఎస్) కీలక పాత్ర పోషించారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్ అన్నారు. ఫిబ్రవరి 20న సాయంత్రం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అగ్రనాయకుడు సత్యనారాయణ సింగ్ శత జయంతి సభ కరపత్రాలను శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, నాయకులు సైదులు, నర్సిరెడ్డి, రమేష్, భరత్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

యోగానంద ఆలయంలో డోలోత్సవం



డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి డోలోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఊయలలో శ్రీదేవి, భూదేవిసమేత నర్సింహస్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి వేద మంత్రాల మధ్య డోలోత్సవం నిర్వహించారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు విఖనసచార్యులు, రాంబాబు, ఆనంద్‌దీక్షిత్, పవన్ పాల్గొన్నారు.

సుందరంగా తీర్చిదిద్దాలి

- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



పుల్లారెడ్డి చెరువు మినీ ట్యాంక్‌బండ్ పనులను పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట: జిల్లా కేంద్రంలో రూ.17కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న పుల్లారెడ్డి చెరువు మినీ ట్యాంక్ బండ్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది పాత కట్టకు కొత్త కళను తేవాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని పుల్లారెడ్డి చెరువు మినీ ట్యాంక్ బండ్ కట్ట నిర్మాణ పనులను కట్ట వెంట తిరుగుతూ పరిశీలించి అధికారులకు కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ ట్యాంక్ బండ్ నిర్మాణంలో భాగంగా కట్టకింద రోడ్లు డౌన్ కావడంతో మెట్లు ఏర్పాటు చేయాల్సింగా సూచించారు. మినీ ట్యాంక్ బండ్ వద్ద పార్కుతోపాటు కట్టను మరికొంత వెడల్పు చేసి కట్ట వెంట గ్రీనరీని ఏర్పాటు చేసి ఆహ్లాదకరంగా మార్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, బీఆర్‌ఎస్ నాయకులు వల్దాసు జానీ, ఆకుల లవకుశ, మకట్‌లాల్, పీఆర్ డీఈ రమేష్, ఏఈ పాండు నాయక్, కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

23న 'చలో కలెక్టరేట్'



సమావేశంలో మాట్లాడుతున్న రేణుక

దురాజ్‌పల్లి : డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, అభయహస్తం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించనున్న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర నాయకురాలు కొత్తపల్లి రేణుక పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డ్వాక్రా మహిళలకు కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. వడ్డీ లేని రుణాల పేరుతో స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇస్తూ 12 శాతం వడ్డీ వసూలు చేస్తున్నారని, తిరిగి చెల్లించవలసిన ప్రభుత్వం వడ్డీ బకాయిలు చెల్లించకుండా మహిళలను మోసం చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, జయమ్మ, రేణుక, సంతోషి, కవిత తదితరులు పాల్గొన్నారు.

శివోహం



మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పిల్లలమర్రిలోని శివాలయానికి శనివారం రాత్రి తరలివచ్చిన భక్తులు



పిల్లలమర్రి ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన శివలింగానికి మొక్కుతున్న యువతి





సూర్యాపేటలోని పాత శివాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి అభిషేకం చేస్తున్న మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

పల్లెకు నిధుల కొరత

పది నెలలుగా విడుదలకాని కేంద్రం కోటా

- ఏడు నెలలుగా జమకాని రాష్ట్ర నిధులు
- గ్రామాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి
- సిబ్బంది వేతనాల చెల్లింపులకూ ఇక్కట్లే..



జిల్లా జనాభా	మండలాల సంఖ్య
8,21,690	23
గ్రామ పంచాయతీలు	మల్టీపర్పస్ వర్కర్లు
475	2,300

కేంద్ర,రాష్ట్రాల నుంచి అందాల్సిన నిధులు రూ.17.76కోట్లు (చెరో రూ.8.88కోట్ల చొప్పున)

జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని ఓ చిన్న గ్రామపంచాయతీలో సుమారు 500 జనాభా ఉన్నారు. ఈ గ్రామ పంచాయతీకి 15వ ఆర్థిక సంఘం నిధులు, స్టేట్ ఫైనాన్స్ నిధులు కలిపి ప్రతినెలా సుమారు 90 వేలు అందేవి. ఈ నిధులతో ట్రాక్టర్ ఈఎంఐ, కరెంట్ బిల్లులు, మల్టిపర్పస్ వేతాలను చెల్లిస్తూ వచ్చేవారు. కానీ కొన్ని నెలలుగా నిధులు విడుదల కాక పోవడంతో ఇక్కడ పని చేస్తున్న ఇద్దరు మల్టీపర్పస్ వర్కర్లకు తొమ్మిది నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో ఆ ఇద్దరు వర్కర్లు విధులు హాజరుకావడం లేదు. ఇది జిల్లా వ్యాప్తంగా అన్ని చిన్న పంచాయతీల పరిస్థితి ఇలాగే ఉంది.

దురాజ్‌పల్లి (సూర్యాపేట): గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత ఏర్పడింది. పది నెలలుగా కేంద్ర ప్రభుత్వ నిధులు రాక.. ఏడు నెలలుగా రాష్ట్రప్రభుత్వ నిధులు జమకాకపోవడంతో పల్లెల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. పల్లె ప్రగతి, రోజువారీ పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు పంచాయతీల ఖాతాల్లో నిధులు లేకపోవడంతో సర్పంచ్‌లు తలలు పట్టుకుంటున్నారు. గ్రామ పంచాయతీలకు ఆస్తి పన్ను, ఇతర రూపాల్లో సొంతంగా సమకూరిన ఆదాయాన్ని వినియోగించుకునేందుకు వీలు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో ఈ పరిస్థితి దాపురించింది. ముఖ్యంగా 500లోపు జనాభా కలిగిన జిల్లాలోని 37 పంచాయతీల పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరుతోనే..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతోనే గ్రామ పంచాయతీల ఖజానా ఖాళీ అవుతోంది. పంచాయతీలకు కేంద్రం ఇస్తున్న నిధులను పది నెలలుగా నిలిపివేసింది. చేసిన పనులకు చెల్లించాల్సిన బిల్లులను కూడా ఆలస్యంగా జమ చేస్తోంది. జిల్లాలో 8,21,690 మంది గ్రామీణ జనాభా ఉన్నారు. పంచాయతీలో జనాభాను బట్టి ఒక్కొక్కరికీ రూ.166 చొప్పున కేంద్రం ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తోంది. కేంద్రం ప్రతినెలా రూ.8.88 కోట్లను 15వ ఆర్థిక సంఘం నిధుల కింద అందిస్తుండగా.. రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ఫైనాన్స్ గ్రాంట్‌గా మరో రూ.8.88 కోట్లు అందిస్తోంది.

పంచాయతీలకు ప్రత్యేక ఖాతాలు..

అయితే కేంద్ర నిధులను రాష్ట్ర ప్రభుత్వం తమ నిధులుగా ప్రచారం చేసుకుంటుందని.. రాష్ట్రంతో సంబంధం లేకుండా నేరుగా పంచాయతీల ఖాతాల్లో జమ చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు ప్రత్యేకంగా ఖాతాలు తెరవాలని సూచించింది. సర్పంచ్‌లు బ్యాంకు ఖాతాలను సైతం తెరిచారు. గత పది నెలలుగా నిధులను మాత్రం జమ చేయడం లేదు. ఏప్రిల్ నుంచి 15 ఆర్థిక సంఘం నిధులు రాక.. పోగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన వాటా ఆగస్టు నుంచి మంజూరు చేయడం లేదు. అయితే రెండు నెలల క్రితం జిల్లాలోని కొన్ని గ్రామ పంచాయతీలకు ఒక నెలకు సంబంధించి నిధులను ఖాతాల్లో జమ చేశారు. కాని ఆ తరువాత నిధులు మళ్లీ కావడం లేదు. దీంతో గ్రామాల్లో పనులు ఎలా చేపట్టాలో తెలియక సర్పంచ్‌లు సతమతమవుతున్నారు. పంచాయతీల్లో చేసిన పనులకు సంబంధించిన చెక్కులను ట్రెజరీలకు పంపించి నెలలు గుడుస్తున్నా ఖాతాల్లో మాత్రం నగదు జమ చేయడంలేదని సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు.

కార్మికుల వేతనాలకు ఇక్కట్లు..

మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో తొలి మెట్టు అయిన గ్రామ పంచాయతీలు నిధుల కొరతతో అల్లాడుతున్నాయి. కొన్ని పంచాయతీలు నాలుగు నెలల నుంచి 10 నెలలుగా కార్మికులకు వేతనాలు కూడా ఇవ్వలేక పోతున్నాయి. జిల్లాలోని 23 మండలాలు 475 గ్రామపంచాయతీల్లో 2,300 మంది మల్టీపర్పస్ కార్మికులు పనిచేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు –వాటర్మెన్, ఎలక్ట్రీషియన్, ట్రాక్టర్ డ్రైవర్, కారోబార్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో పంచాయతీలో ఇద్దరు నుంచి కార్మికులు పనిచేస్తుండగా, ఒక్కొక్కరికి నెలకు రూ.8,500 చొప్పున వేతనం చెల్లిస్తున్నారు. 500 జనాభా లోపు ఉన్న పంచాయతీలో సమస్య తీవ్రంగా ఉంది. కొన్ని పంచాయతీల్లో అనధికారికంగా కార్మికులను తీసివేసినట్లు సమాచారం.

కోర్టులో సమస్యల పరిష్కారానికి కృషి

- జిల్లా పోర్టు పోలియో, అడ్మినిస్ట్రేటివ్ జడ్జి రాధారాణి



కోర్టు పరిసరాలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి

చివ్వెంల(సూర్యాపేట): సూర్యాపేట జిల్లా కోర్టులోని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని జిల్లా పోర్ట్ పోలియో, అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జి.రాధారాణి అన్నారు. శనివారం విజయవాడకు వెళ్తూ మార్గమధ్యలోని సూర్యాపేట జిల్లా కోర్టును సందర్శించి పరిశీలించారు. అడ్మినిస్ట్రేటివ్ జడ్జిగా బాధ్యతలు చేపట్టాక సూర్యాపేటకు మొదటిసారిగా వచ్చిన ఈ సందర్భంగా ఆమెకు న్యాయవాదులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అదే విధంగా సబ్ జైలును సందర్శించి ఖైదీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను న్యాయవాదులు పోర్టు పోలియో జడ్జి దృష్టికి తీసుకెళ్లారు. వీటికి స్పందించిన పోర్టు పోలియో జడ్జి మాట్లాడుతూ ఈ విషయాలను హైకోర్టు దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం లోక్ అదాలత్‌పై విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ చిన్న చిన్న ఘర్షణలకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, కోర్టు మెట్లు ఎక్కకుండా గ్రామాల్లోనే పరిష్కరించుకోవాలని, దీనివల్ల కాలం, ధనం వృథా కాకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.గౌతం ప్రసాద్, మొదటి అదనపు న్యాయమూర్తి బి.ప్రేమలత, సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి సీనపల్లి సోమేశ్వర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్‌కు 45 ప్రాజెక్టులు

- జిల్లా నుంచి వెయ్యికిపైగా ఆన్‌లైన్ ఎంట్రీల నమోదు
- వాటిలోంచి ఎంపిక చేసిన కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ, నిఫ్ సంస్థ
- అత్యధికంగా సూర్యాపేట మండలం నుంచి 11 ఎంపిక
- ఒక్కో ఎగ్జిబిట్ నిర్వహణకు త్వరలో రూ.10వేల చొప్పున జమ



ప్రాజెక్టును పరిశీలిస్తున్న డీఈఓ (ఫైల్)

చిలుకూరు: పాఠశాల దశలోనే విద్యార్థులను బాల శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (నిఫ్) సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ అవార్డు మానక్ కింద ఈ విద్యాసంవత్సరానికి (2022–23) గాను జిల్లా నుంచి వెయ్యికి పైగా ప్రాజెక్టులు ఆన్‌లైన్‌లో నమోదు చేయగా 45 ఎంపికయ్యాయి. ఈ మేరకు ఇటీవల రాష్ట్రస్థాయి నుంచి జాబితాను విడుదల చేశారు. ఎంపికైన ప్రతి ప్రాజెక్టుకు సంబంధించి రూ.10వేల ఆర్థికసాయాన్ని విద్యార్థుల ఖాతాల్లో త్వరలో జమ చేస్తారు. జమ చేసిన నిధులతో తాము నమోదు చేసిన ప్రాజెక్టు (ఎగ్జిబిట్ల)ల ప్రదర్శనకు ఖర్చు చేయనున్నారు. అయితే జిల్లా స్థాయిలో ఎంపికైన ఉత్తమ ప్రాజెక్టులను జూన్ తర్వాత ప్రదర్శించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఎంపికైన ప్రాజెక్టులను జిల్లా స్థాయిలో గైడ్ టీచర్ల సహాయంతో ఆయా విద్యార్థులచే ప్రదర్శించడానికి విద్యాశాఖ సిద్ధమవుతోంది.

వివిధ స్థాయిల్లో ఎంపిక ఇలా..

అన్ని యాజమాన్యాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదివే వారు ఈ పథకం కింద ప్రాజెక్టులు ప్రదర్శించడానికి అర్హులు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉత్తమ ప్రాజెక్టులను పంపించవచ్చు. ఎంపికైన ప్రాజెక్టుల తయారీకి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేస్తారు. మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లోనూ ప్రాజెక్టుల ప్రదర్శన పోటీలు జరుగుతాయి. అత్యుత్తమ ఆలోచనలతో రూపొందించి ప్రాజెక్టులు మండల నుంచి జాతీయ స్థాయి పోటీకి వరకు చేరుకొనే అవకాశం ఉంటుంది. జాతీయ స్థాయిలో 60 అత్యుత్తమ ప్రాజెక్టును ఎంపిక చేసి రాష్ట్రపతి భవనలో వాటిని ప్రదర్శింపజేస్తారు. ఇందులో ఉత్తమమైన వాటిని జపాన్‌లో నిర్వహించే విజ్ఞాన యాత్రకు అవకాశం కల్పిస్తారు. కొన్నేళ్లుగా వందలాది మంది విద్యార్థులు ఇన్‌స్పైర్‌కు ఎంపికవుతుండగా గత ఏడాది మాత్రం 54 ప్రాజెక్టులు ఎంపికై జాతీయ స్థాయి వరకు వెళ్లగలిగాయి.

మండలాల వారీగా ఎంపికైన అవార్డుల సంఖ్య

చిలుకూరు	01	నడిగూడెం	03
ఆత్మకూర్(ఎస్)	02	నాగారం	03
చివ్వెంల	03	నేరేడుచర్ల	03
కోదాడ	06	సూర్యాపేట	11
మోతె	01	తుంగతుర్తి	07
మునగాల	05	మొత్తం	45

లక్ష్యం ఇదే..

10 నుంచి 15 ఏళ్ల వయస్సు కలిగిన విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయమైన ఆలోచనలను పెంపొందిస్తూ శాస్త్ర, సాంకేతిక రంగాల వైపు మళ్లించేలా చేయాలనే లక్ష్యంతో వారిని ప్రోత్సహించేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ (డీఎస్‌టీ), గుజరాత్‌లోని నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (నిఫ్) సంయుక్తంగా పదేళ్ల నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఏటా పది లక్షల మంది విద్యార్థులకు నూతన ఆవిష్కరణలకు అవకావం కల్పిస్తోంది.

ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తాం




ఈ విద్యాసంవత్సరంలో జిల్లా నుంచి దాదాపుగా వెయ్యి ప్రాజెక్టులను ఇన్‌స్పైర్‌కు నమోదు చేస్తే అందులో 45 రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. ఈ ప్రాజెక్టులను విద్యార్థులు విజయవంతంగా ప్రదర్శించేలా గౌడ్ టీచర్లు మరింతగా కృషి చేయాలి. గతంలో మాదిరిగానే విద్యార్థులకు విషయ నిపుణులతో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తాం.

– ఎల్.దేవరాజ్, జిల్లా సైన్స్ అధికారి

తుది దశకు పంటల నమోదు

- యాసంగి సాగుపై సర్వే చేస్తున్న వ్యవసాయ శాఖ
- క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్న ఏఈఓలు
- ఇప్పటి వరకు 4.66 లక్షల ఎకరాల్లో పూర్తి



భానుపురి (సూర్యాపేట): జిల్లాలో యాసంగి పంటల సాగు వివరాల నమోదు చివరి దశకు చేరింది. పంటల వివరాలు పక్కాగా ఉండడంతో పాటుగా మార్కెటింగ్ సదుపాయం సులభతరంగా ఉంటుందన్న ఆలోచనతో ప్రభుత్వం రెండేళ్లుగా పంటల నమోదు కార్యక్రమాన్ని చేపడుతోంది. మొదటగా రైతు యూనిట్‌గా వివరాలు సేకరించడంతో కొంత ఇబ్బంది ఎదురైంది. దీన్ని సవరించేందుకు సర్వే నంబర్ల ఆధారంగా ఆన్‌లైన్‌లో పంటల నమోదు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రస్తుత యాసంగి సీజన్ పంటల నమోదు కొనసాగుతుండగా ఈ ప్రక్రియ తుది దశకు చేరినట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

సర్వే నంబర్ల ఆధారంగా..!

జిల్లాలో యాసంగి సీజన్‌లో దాదాపు 4..60 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు అధికారులు ఎరువులు, విత్తనాలు సిద్ధం చేయగా.. నీటి వసతి అధికంగా ఉండడంతో అధికారుల అంచనాకు మించి రైతాంగం పంటలను సాగు చేశారు. పంటల నమోదు పక్కాగా ఉండేందుకు గాను సర్వే నంబర్ల ఆధారంగా రైతు ఎంత విస్తీర్ణంలో.. ఏఏ పంటలు సాగు చేశాడన్న వివరాలను క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు సేకరిస్తున్నారు. ఇలా సేకరించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చుతున్నారు.

4.66 లక్షల ఎకరాల నమోదు

ఈ సీజన్ ప్రారంభం నాటినుంచి కొనసాగుతున్న ఈ పంటల నమోదు ప్రక్రియ దాదాపు పూర్తికావొచ్చింది. ఇప్పటి వరకు జిల్లాలో 4.66 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ పంటలను సాగు చేశారు. ఇందులో 4.63 లక్షల ఎకరాలతో వరిసాగు అత్యధికంగా ఉంది. అయితే జిల్లాలోని అక్కడక్కడా మెట్ట పంటలు, కూరగాయల సాగు చేపడుతుండడంతో వీటి నమోదు కొనసాగుతోంది.

పంటల నమోదు వివరాలు ఇలా..

పంట	ఎకరాలు	జొన్న	456
వరి	4,63,687	పెసర	92
పత్తి	19	వేరుశనగ	690
కంది	05	చెరుకు	238
శనగ	34.36	కొర్రలు	10.06
మినుము	78	ఇతర పంటలు	319
మొక్కజొన్న	392	మొత్తం	4,66,020

ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు

జిల్లాలో యాసంగి పంటల సాగు వివరాలను ఎప్పటికప్పుడు తమ శాఖ అధికారులు రైతుల నుంచి సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ దాదాపు తుది దశకు చేరుకుంది. అక్కడక్కడా రైతులు చేపట్టిన మెట్ట పంటలు, కూరగాయల సాగు వివరాలు సేకరిస్తున్నారు.

– రామరావునాయక్, జిల్లా వ్యవసాయ అధికారి

నేటి నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

పెద్దవూర: నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం బట్టుగూడెంలో మహా శివరాత్రి సందర్భంగా ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నక్కల రామాంజిరెడ్డి, కూతాటి దేశ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు తమ జట్లపేరును ఆదివారం సాయంత్రం లోగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రథమ బహుమతి రూ.25వేలు, ద్వితీయ రూ.20వేలు, తృతీయ రూ.15వేలు, నాలుగో రూ.12వేలు, ఐదో బహుమతి రూ.11వేలు, ఆరో బహుమతి రూ.10వేలు, ఏడో బహుమతి రూ.8వేలు, ఎనిమిదో బహుమతిగా రూ.7వేల నగదుతో పాటు షీల్డులను అందించనున్నట్లు పేర్కొన్నారు.

సస్పెన్షన్లతో బెదిరించడం సరికాదు

సూర్యాపేట టౌన్: పండిట్లు తమ న్యాయమైన హక్కుల కోసం కొట్లాడుతుంటే వాటిని పరిష్కరించకుండా ప్రభుత్వం తాత్సారం చేయడమే కాకుండా సస్పెన్షన్లతో బెదిరించడం సరికాదని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రేపాక లింగయ్య, బొల్లెద్దు వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం వారు సూర్యాపేట పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ ఎస్‌జీటీలు, పండితులకు ప్రమోషన్లు కల్పించాలన్నారు. భాషా పండితులు ప్రభుత్వంతో పోరాడి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని హితవు పలికారు.

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధం

త్రిపురారం: షార్ట్ సర్క్యూట్ జరిగి పూరి గుడిసె దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పడిశల నాగయ్య, రమణ దంపతులు కూలీ పనులు చేసుకుంటూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బజారులో పూరి గుడిసెలో నివాసముంటున్నారు. మహాశివరాత్రి సందర్భంగా శనివారం ఉదయం వారు నివాసముంటున్న గుడిసెకు తాళం వేసి స్థానికంగా ఉన్న దేవాలయానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. ఆ సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి నిప్పు రవ్వలు గుడిసెకు అంటుకున్నాయి. చుట్టుపక్కల వారు మంటలు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో విలువైన సామగ్రితో పాటు ఎల్లమ్మ పండుగ చేయడానికి దాచుకున్న రూ.60వేల నగదు, బియ్యం, వస్తువులు, దుస్తులు కాలిబూడిదయ్యాయి. నిరుపేదనైన తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

తేనెటీగల దాడి

మునుగోడు: తేనెటీగలు దాడి చేయడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాలు.. మునుగోడు గ్రామ శివవారులోని బొడ్డు పెద్ద చంద్రమౌళిగౌడ్ తన వ్యవసాయ పొలం వద్దకు తన స్నేహితులైన గంజి నర్సింహరావు, మిఖేల్‌తో కలసి శనివారం ఉదయం వెళ్లాడు. అయితే అక్కడే ఓ చెట్టుపై ఉన్న తేనెటీగలు ఒక సారిగా లేచి ముగ్గురిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. ఈ క్రమంలో చంద్రమౌళిగౌడ్, నర్సింహరావు స్పృహ కోల్పోయి కింద పడిపోయారు. చుట్టుపక్కల వారు గమనించి 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్పృహ కోల్పోయిన ఇద్దరినీ ఐసీయూలో ఉంచి డాక్టర్లు వైద్యం అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మిర్యాలగూడ టౌన్: దామరచర్ల మండలం కొండ్రపోలు శివారులో గల ఎల్-3 కెనాల్‌లో శనివారం గుర్తుతెలియని వ్యక్తి(40) మృతదేహం లభ్యమైనట్లు వాడపల్లి ఎస్‌ఐ మామిడి రవికుమార్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొండ్రపోలు శివారులో ఎల్-3 కెనాల్‌లో దుర్వాసన వస్తుండడంతో స్థానికులు గుర్తించి వాడపల్లి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. మృతుడు ఎరుపు రంగు చొక్కా ధరించాడని, దానిపై ఆక్స్‌ఫర్డ్ టైలర్ కోదాడ అని ఉందని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహం 10రోజుల క్రితం నీటిలో కొట్టుకొని వచ్చి ఉండవచ్చని అన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలిసిన వారు 9440795605, 9440795607 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్‌ఐ సూచించారు.

మార్మోగిన శివనామస్మరణ


నేరేడుచర్ల: బురుగులతండా సోమప్ప ఆలయంలో శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు


మోత్కూరు పట్టణంలో మహాశివరాత్రి బోనాలు నిర్వహిస్తున్న మహిళలు


నార్కట్‌పల్లి: చెర్వుగట్టులో స్వామి వారి దర్శనానికి బారులుదీరిన భక్తులు


నకిరేకల్‌లో పండ్లు, కూరగాయలతో శివలింగం నమూనా


పిల్లలమర్రిలోని శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు


పానగల్లులో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


పానగల్లులోని ఛాయా సోమేశ్వరాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు


ఆలేరురూరల్: కొలనుపాకలో కోటి లింగాలను దర్శించుకున్న భక్తులు


పిల్లలమర్రిలో శివుడిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు


వాడపల్లిలోని శ్రీమీనాక్షి అగస్త్యేశ్వర ఆలయంలో భక్తులు

రైలు కింద పడి ఇద్దరు యువకులు దుర్మరణం

- పగిడిపల్లి వద్ద రైల్వే స్టేషన్ సమీపంలో మృతదేహాలు లభ్యం

బీబీనగర్: బీబీనగర్ పరిధిలోని పగిడిపల్లి వద్ద రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం ఇద్దరు యువకులు రైలు కింద పడి మృతిచెందారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చెలువాయి గ్రామానికి చెందిన నారమళ్ల నరేష్(29) ఈ నెల 15న హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి 17న ఇంటికి వెళ్తుండగా పగిడిపల్లి సమీపంలోని రైలు కింద పడి మృతిచెందాడు. అదే రోజు శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం వాలేటిపాలెం గ్రామానికి చెందిన గుత్తి శ్రీధర్(26) పని నిమిత్తం హైదరాబాద్‌కు వస్తుండగా పగిడిపల్లి సమీపంలోని మరో రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని రైలు కింద పడి మృతిచెందాడు. శనివారం రైల్వే ట్రాక్‌పై పడి వున్న మృతదేహాలను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకొని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా మృతులిద్దరూ అవివాహితులు అని, ప్రమాదవశాత్తు రైలు కింద పడి చనిపోయి ఉంటారా లేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

153 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నకిరేకల్: మండలంలోని కడపర్తి శివారులో ఓ వ్యవసాయ బావి వద్ద నిల్వ ఉంచిన 153 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. నకిరేకల్ సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కడపర్తి గ్రామానికి చెందిన యాదగిరి వ్యవసాయ బావి వద్ద షెడ్డులో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం అర్ధరాత్రి ఎస్‌ఐ గోపికృష్ణ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి 153 క్వింటాళ్ల(370 బస్తాలు) బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బియ్యాన్ని సీజ్ చేసి నకిరేకల్‌లోని సివిల్ సప్లై గోదాంకి తరలించారు. నోముల గ్రామానికి చెందిన గుండగోని చంద్రశేఖర్ ఈ రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినట్లు గుర్తించామని సీఐ తెలిపారు. డీటీసీఎస్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


పట్టుబడిన రేషన్ బియ్యాన్ని చూపుతున్న ఎస్‌ఐ గోపికృష్ణ తదితరులు

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

కోదాడరూరల్: కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని గుడిబండ శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. నడిగూడెం ప్రాంతంలో ఓ రైస్ మిల్లులో పనిచేసే బిహార్‌కు చెందిన ఇద్దరు కార్మికులు బైక్‌పై మేళ్లచెర్వు జాతరకు వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో గుడిబండ శివారుకు రాగానే ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొని పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరికి గాయాలు కావడంతో కోదాడ ఆస్పత్రికి తరలించారు. కారులో ఉన్నవారు స్వల్ప గాయాలతో బయటపడినట్లు స్థానికులు తెలిపారు.


బైక్‌ను ఢీకొట్టి పొలంలోకి దూసుకెళ్లిన కారు

12మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ.3,37,000 నగదు, 12 సెల్‌ఫోన్‌లు స్వాధీనం
- రిమాండ్‌కు తరలింపు

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి శివారులో పేకాట ఆడుతున్న పన్నెండు మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకోగా, వారిని అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు నార్కట్‌పల్లి సీఐ కె. శివరాంరెడ్డి తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శనివారం చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వెల్లడించారు. శుక్రవారం పెద్దకాపర్తి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో పలువురు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పన్నెండు మందిని పట్టుకున్నారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.3,37,000 నగదు, పన్నెండు సెల్‌ఫోన్‌లు, మూడు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో మిర్యాలగూడ మండలంలోని యాదగిరిపల్లికి చెందిన గునగంటి కిరణ్‌తో పాటు అయితగోని భుజంగౌడ్, షేక్ మహబూబ్ బాషా, షేక్ ఉమర్ అలీ, తాటిచెట్టు రాఘవేందర్, గుడిపాటి శ్రీనివాస్, గంజి రవికుమార్, జిన్నే అనంతరెడ్డి, ఇమ్మడి కిరణ్‌కుమార్, కమ్మద్రి సంతోష్, పంగ గోపి, కోలా రాములు ఉన్నారు. పగిళ్ల రమేష్ అనే మరో వ్యక్తి పరారైనట్లు సీఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. గునగంటి కిరణ్ ఎప్పటికప్పుడు అడ్డాలను మార్చుతూ నల్లగొండతో పాటు హైదరాబాద్, చౌటుప్పల్ ప్రాంతాలకు చెందిన వారితో పేకాట ఆడిస్తుంటాడని సీఐ పేర్కొన్నారు. పట్టుబడిన వారిపై ఇప్పటికే జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ ఎన్. ధర్మా పాల్గొన్నారు.


పేకాటరాయుళ్ల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్‌లు

నాటుసారా స్వాధీనం.. ఐదుగురి అరెస్ట్


పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

హుజూర్‌నగర్‌రూరల్: హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారం, మేళ్లచెర్వు మండలంలోని హేమ్లాతండాలో శనివారం హుజూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు, డీటీఎఫ్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి సుమారు 400లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగర్జునరెడ్డి తెలిపారు. అదేవిధంగా 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ సీఐ ఏలే శ్రీనివాస్, ఎక్సైజ్ ఎస్‌ఐ వెంకన్న, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చౌటుప్పల్: మండల పరిధిలోని ఎల్లం బావి గ్రామ శివారులో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన రత్నావత్ సంతోష్(20) డిగ్రీ చదువుతున్నాడు. సొంత పనిమీద ద్విచక్ర వాహనంపై హైదరాబాద్కు వెళ్లాడు. తిరిగి సూర్యాపేటకు వెళ్తుండగా క్రమంలో మండల పరిధిలోని ఎల్లం బావి గ్రామ శివారులోని అండర్ పాస్ దాటిన తర్వాత రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పంచ నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట: యాదాద్రి పుణ్యక్షేత్రంలో శనివారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువ జామున ఆలయాన్ని తెరచిన ఆచార్యులు.. శ్రీస్వామి వారికి సుప్రభాతం చేపట్టారు. అనంతరం ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. ముఖ మండపంలోని ఉత్సవమూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన, ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవోత్సవం జరిపించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

చెట్టు పైనుంచి పడి వృద్ధుడు మృతి

మోత్కూరు: చింతచెట్టు పైనుంచి పడి వృద్ధుడు మృతిచెందిన ఘటన మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ కేంద్రంలోని యాదవ కాలనీకి చెందిన బొడిగె ఎల్లయ్య (70) శనివారం ఉదయం చింతపండు తెంపడానికి స్థానిక వైజే ఫంక్షన్ హాల్ సమీపంలోని చిప్పలపల్లి యాదగిరి వ్యవసాయ బావి వద్ద ఉన్న చింతచెట్టు ఎక్కాడు. చింతపండు తెంపుతుండగా ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి జారి పడటంతో ఎల్లయ్య తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా ఎస్‌ఐ జానకిరాంరెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మదార్ (ఫైల్)

మునగాల(కోదాడ): మండల పరిధిలోని నేలమర్రి గ్రామానికి చెందిన బచ్చలకూర మదార్(52) హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందినట్లు స్థానిక ఎస్‌ఐ పి. లోకేష్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చలకూర మదార్‌కు అదే గ్రామానికి చెందిన బచ్చలకూర సంజీవకు వ్యక్తిగత గొడవలు ఉన్నాయి. కాగా సంజీవ ఈ నెల 16వ తేదీ రాత్రి మదార్‌పై కర్రతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. దీంతో మదార్‌ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి కుమారుడు నాగార్జున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం


మహేష్ (ఫైల్)

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని వేల్పుచర్ల వద్ద సూర్యాపేట–జనగామ 365బీ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాయామ ఉపాధ్యాయుడు(పీఈటీ) దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన సైదుల మహేష్(22) కోదాడలోని గురుకుల విద్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగా శుక్రవారం విధులు ముగించుకొని స్వగ్రామం జాజిరెడ్డిగూడేనికి బైక్‌పై వస్తుండగా వేల్పుచర్ల వద్ద హైవేపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై కె. కృష్ణమూర్తి తెలిపారు. మృతుడు అవివాహితుడు కాగా, అతడి తండ్రి సోమనర్సయ్య నెల రోజుల కిందట అనారోగ్యంతో మృతిచెందినట్లు తెలుస్తోంది.

వేములపల్లిలో వృద్ధురాలు..


బాయమ్మ (ఫైల్)

మిర్యాలగూడ: వేములపల్లి మండల కేంద్రంలోని నార్కట్‌పల్లి–అద్దంకి బైపాస్‌పై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండల కేంద్రానికి చెందిన గుండెబోయిన బాయమ్మ(68) సరుకులు తీసుకురావడానికి కిరాణా దుకాణానికి రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తుండగా నల్లగొండ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాయమ్మ తల, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే 108 వాహనంలో మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు హెడ్ కానిస్టేబుల్ సామియేల్ తెలిపారు.


నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్ వద్ద ఉదయం వేళ కమ్మేసిన మంచు


మంచులో వెళ్తున్న వాహనాలు